అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్


సంక్షేమ పథకాల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేవిధంగా కృషి చేస్తానని, అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవించుకున్నారు. కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ఇంకా మంజూరు కాలేదని కొందరు, శస్త్రచికిత్స కోసం చేసుకున్న సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులకు మోక్షం లభించలేదని మరికొందరు ఆయనకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అలీ ముద్దీన్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ నలుదిశలా అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, ఆల పురుషోత్తమ్ రావు, పాండుయాదవ్

అబిడ్స్: గోషామహల్ నలుమూలలా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. బుధవారం గోషామహల్ ప్రాంతంలో రూ.7.10 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లను ప్రారంభించారు. రాజాసింగ్ మాట్లాడుతూ పదేళ్లుగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు, పాండు యాదవ్ కార్పొరేటర్ లాల్‌సింగ్, ఎం.కృష్ణ, డి.గోపాల్‌జీ, నరహరి, జీవన్ సింగ్, మహేష్, సుధీర్ సింగ్, రాము, నవీన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల నియామకం


ప్రతిజ్ఞ చేస్తున్న శ్రీనాథ్, విజయభాస్కర్

యాకుత్‌పురా: తెలంగాణ రీజియన్ టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీవాటి శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్. విజయభాస్కర్‌లు నియమితులయ్యారు. టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సుల్తాన్‌షాహిలోని శాలిబండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్‌రెడ్డి ఆదేశాల మేరకు వారిని నియమించినట్లు ప్రధాన కార్యదర్శి ఎం.అంజిరెడ్డి తెలిపారు. శ్రీనాథ్ పేట్లబుర్జు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుండగా, విజయ భాస్కర్ శాలిబండ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం ఎన్నికైన వారితో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు


విజేతలతో మహ్మద్ హిదాయత్ అలీఖాన్

గోల్కొండ: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని వీనస్ విద్యాసంస్థల డైరెక్టర్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. వీనస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బుధవారం టోలిచౌకీ డీలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్‌లో సన్మానించి బహుమతులు అందజేశారు. చిన్నారులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల వారిలో పోటీతత్వం పెరుగుతుందని అన్నారు. పోటీతత్వం ఉన్న విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో విశేషంగా రాణిస్తారని, నాయకత్వ లక్షణాలు కూడా పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గౌలిపురా: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మొఘల్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగులచింత ఎక్స్‌రోడ్డు తివారీ టవర్స్ ప్రాంతంలో ఈ నెల 10న 35–40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిని అంబులెన్స్ వైద్యులతో కలిసి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. దీంతో మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

2 కిలోల గంజాయి పట్టివేత


పట్టుబడిన గంజాయి, బైక్, విక్రయదారుడు

జియాగూడ: సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలానగర్‌లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించగా 2.3 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్‌టీఎఫ్‌టీ లీడర్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తున్న మహమ్మద్ సోహైల్ వాహనాన్ని పట్టుకొని తనిఖీలు నిర్వహించగా గంజాయి పట్టుబడింది. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐ సాయి కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

జియాగూడ: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్ తెలిపారు. మంగళ్‌హాట్ జాలి హనుమాన్ ప్రాంతంలో ఉంటున్న సతీష్(35) గత కొన్ని రోజుల నుంచి గంజాయి విక్రయిస్తూ తప్పించుకు తిరుగుతున్నాడు. కాగా బుధవారం పోలీసులు నిఘా పెట్టి అతడిని పట్టుకున్నారు.

సన్మానం


యాదగిరిరావును సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రముఖ చిత్రకారుడు ఎక్కా యాదగిరిరావు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరిలను గుడిమల్కాపూర్ బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు దేవర వంశీ మాట్లాడుతూ ఎక్కా యాదగిరిరావు, పాశం యాదగిరి తమ ప్రతిభ, ఆలోచనలతో సమాజ ఉన్నతికి పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవర రాజేశ్వర్‌రావు, ప్రభు పూజారి, డి.రాజశేఖర్ తదితరులున్నారు.

ప్రతీ ఇంట్లో భగవద్గీత ఉండాలి


గోమాత చిత్రపటాన్ని అందజేస్తున్న హిందూ రాష్ట్ర సేన ప్రతినిధులు

జియాగూడ: భగవద్గీత ప్రతీ ఇంట్లో ఉండితీరాలని ఆర్ఎస్ఎస్ గోల్కొండ విభాగ్ సహ కార్యదర్శి గరుడ విజయ్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నిత్యా పరీక్ అన్నారు. బుధవారం జియాగూడలోని విద్యాశ్రీ హైస్కూల్‌లో గీతా జయంతి వేడుకలను హిందూ రాష్ట్ర సేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1100 హనుమాన్ చాలీసా పుస్తకాలను, 108 భగవద్గీత పుస్తకాలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో హిందూరాష్ట్ర సేన ప్రధాన కార్యదర్శి ఆదిత్య శిరసత్, స్కూల్ కరస్పాండెంట్ శ్యామ్‌వెరా, ప్రిన్సిపాల్ సునీత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైస్ చాన్స్‌లర్ గంగాధర్‌కు సన్మానం


గంగాధర్‌ను సన్మానిస్తున్న సాయికుమార్

అబిడ్స్: తెలంగాణ తల్లి విగ్రహ రూపశిల్పి, జేఎన్‌టీయూ ఫైనార్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తోపారపు గంగాధర్‌కు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అభినందనలు సన్మానించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ తెలంగాణ తల్లి రూపకల్పనకు గంగాధర్ చేసి కృషి అమోఘమని కొనియాడారు.

ఉద్యోగులకు అండగా బీఎంఎస్


సమావేశంలో పాల్గొన్న తూర్పు రామిరెడ్డి

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగులకు అండగా భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఎల్లవేళలా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రామిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. బీఎంఎస్ 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులు, స్ట్రీట్ వెండర్స్, అంగన్‌వాడీలకు కూడా కార్మికుల చట్టం ద్వారా అన్ని విధాలా సహకరిస్తున్నామన్నారు. నగర బీఎంఎస్ అధ్యక్షుడు టి.కృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల సహకారంతో పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంపత్‌రెడ్డి, పవన్, వెంకటేష్, యాదగిరి, జగదీష్, రూపేష్‌లు పాల్గొన్నారు.

అభినందనలు


రాజు ముదిరాజ్‌ను సన్మానిస్తున్న నర్సింహా రెడ్డి

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన రాజు ముదిరాజ్‌ను బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి అభినందించారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గిరిబాబు, డి.శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు

యాకుత్‌పురా: మైలార్‌దేవ్‌పల్లి దుర్గ కన్వెన్షన్‌లో మంగళవారం రాత్రి తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కో- కన్వీనర్, సీనియర్ న్యాయవాది ఎ.మాణిక్ ప్రభుగౌడ్ కుమారుడు న్యాయవాది రణదీశ్వర్ గౌడ్, విజయేశ్వరిల వివాహ రిసెప్షన్‌కు పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమానికి బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి, హైదరాబాద్ సిటి సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసాచారి, మాజీ స్పెషల్ జీపీ ఎం.ఎస్ తిరుమల్ రావు, పలువురు న్యాయవాదులు, పలు పార్టీల నాయకులు హాజరయ్యారు.

ఆనందోత్సాహాల మధ్య అయ్యప్ప మహాపడిపూజ


భక్తులు సమర్పించిన గదతో గురుస్వామి రాజు వస్తాద్

లంగర్‌హౌస్: చిన్నారి మణికంఠుడి నామస్మరణతో ఇబ్రహీంబాగ్ ప్రాంతం మార్మోగింది. పండితులు త్రినాథ్, మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘసేవకుడు రాజు వస్తాద్- చంద్రకళ దంపతులు, అర్చన–నందకిషోర్ దంపతులు మహాపడిపూజ నిర్వహించారు. ఇందులో భాగంగా 41 రోజుల నుంచి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, గద్దర్ కుమార్తె వెన్నెల, రమేష్ యాదవ్, అంతిరెడ్డి లింగారెడ్డి గురుస్వాములు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మహ్మద్ ఫహద్

గోల్కొండ: తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ (టీఎఫ్‌సీవో) ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని టీఎఫ్‌సీవో రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహద్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని టీఎఫ్‌సీవో కార్యాలయంలో నిరుపేద మహిళలకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీఎఫ్‌సీవో చైర్మన్ మహ్మద్ నజీబ్ 15 ఏళ్లుగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో టీఎఫ్‌సీవో ప్రతినిధులు వివిధ జిల్లాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.

మారుతీనగర్‌లో ప్రత్యేక పూజలు


దేవతలకు పూజలు చేస్తున్న దృశ్యం

గోల్కొండ: షేక్‌పేట్ మారుతీనగర్ కాలనీలోని శ్రీ విజయగణపతి ఆలయంలో వార్షిక మహోత్సవ పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమ నిర్వాహకులు తోకల సాయిబాబా కౌసల్య సౌజన్యంతో శ్రీ విజయగణపతి, శ్రీ గురు దత్తాత్రేయ స్వామి, శ్రీ సుబ్రహ్మణ్య స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగదేవత అమ్మవారికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పూస బాబురావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

'ఈఎస్ఐసీ'కి నాలుగు పురస్కారాలు

సాక్షి, సిటీబ్యూరో: ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ-ఆదర్శనగర్) కు అంతర్జాతీయ వేదికల్లో గుర్తింపు పొందినట్లు తిరుపతి ఉప ప్రాంతీయ కార్యాలయ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ డి.రాధాకృష్ణ పేర్కొన్నారు. ఇటీవల సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఇంటర్నేషనల్ సోషల్ సెక్యూరిటీ యూనియన్ ఆధ్వర్యంలో 'సామాజిక భద్రత ప్రయోజనాల సేవలపై' జరిగిన సదస్సులో తిరుపతి ప్రాంతీయ ఈఎస్ఐసీకి వర్క్ ప్లేస్ ప్రమాదాలు, అనారోగ్యం, స్థిరమైన పెట్టుబడి, సిస్టమ్ ఫ్లెక్సిబిలిటీకి సంబంధించి నాలుగు ఎక్సలెన్స్ అవార్డులు దక్కాయి. ఈసీఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్ కార్పొరేషన్ తరఫున పురస్కారాలు అందుకున్నారు.

సమగ్ర సర్వే కోసం.. 'ప్రత్యేక' కౌంటర్

రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్



రాజేంద్రనగర్: సమగ్ర కుటుంబ సర్వే కోసం జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... సర్వే కోసం ప్రభుత్వ సిబ్బంది వచ్చిన సమయంలో ఇంటి యజమానులు వివిధ పనుల నిమిత్తం బయటికి వెళ్లినా.. ఇతర కారణాలతో సర్వేలో పాల్గొనని వారి కోసం ఈ కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మొత్తం 6,102 కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదని తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, అత్తాపూర్ డివిజన్ల పరిధిలో మొత్తం 93,560 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఇందులో 87,458 కుటుంబాలు సర్వేలో పాల్గొని తమ డాటాను అందించాయన్నారు.
- 1621 మంది కుటుంబాలు సర్వేకు వెళ్లిన సమయంలో ఇంటికి తాళాలు వేసి ఉన్నాయన్నారు. 2311 కుటుంబాల వారు సర్వే వివరాలను అందించేందుకు నిరాసక్తి చూపారన్నారు. 2170 కుటుంబాలు తాము తమ గ్రామాల్లో సర్వే వివరాలు అందించామని తెలిపామన్నారు.
- ప్రస్తుతం సర్కిల్ కార్యాలయంలో ఇద్దరు సిబ్బందిని నియమించామని.. ఎవరైనా దరఖాస్తులను అందించని వారు ఉంటే పూర్తి వివరాలతో వచ్చి సర్వేలో పాల్గొనవచ్చని డీసీ స్పష్టం చేశారు.
- రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కౌంటర్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

కొనసాగుతున్న డాటా ఎంట్రీ...

సర్కిల్ పరిధిలోని సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తుల డాటా ఎంట్రీ కొనసాగుతున్నదని ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. కాటేదాన్ స్టేడియంలో చేపడుతున్న డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటి 20 శాతం డాటా ఎంట్రీ పూర్తయిందన్నారు. పూర్తయిన దరఖాస్తులను రోజువారీగా ట్రంక్ పెట్టెల్లో చేర్చి వాటిని సర్కిల్ కార్యాలయంలో భద్రపరుస్తున్నామని డీసీ వివరించారు.

ఫ్యాటీ లివర్ అనర్థాలపై అవగాహన


ట్రైనీ ఆఫీసర్లకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ల బృందం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ హిమాయత్‌సాగర్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో లివర్ ఫిబ్రో స్కాన్ క్యాంప్‌ను బుధవారం నిర్వహించారు. ట్రైనీ ఆఫీసర్స్, అకాడమీ స్టాఫ్‌కు జైడస్ ఫార్మా సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. యూనిట్ ఆస్పత్రి డాక్టర్ రమాదేవి సహకారంతో ప్రీ ప్రమోషనల్ ట్రైనీలు, అకాడమీలోని సీనియర్ అధికారులకు ఇందులో వివిధ పరీక్షలను నిర్వహించారు. ఈ లివర్ ఫిబ్రో స్కాన్‌లో డయాబెటిస్, హై బీపీ, ఓవర్ వెయిట్, జాండీస్ లాంటి వాటితో బాధపడే వారికి చెకప్ చేసి గ్రేడింగ్ గుర్తించి తగిన మందులను అందజేశారు. ప్రధానంగా ఫ్యాటీ లివర్ వల్ల నెలకొనే అనర్థాలపై జైడస్ ఫార్మా నిర్వాహకులు అవగాహన కల్పించారు. తగిన మందులు పంపిణీ చేశారు. క్యాంప్‌లో దాదాపు 360 ప్రీ ప్రమోషనల్ ట్రైనీస్, అధికారులు, సిబ్బంది టెస్టులు చేయించుకున్నారు. జైడస్ ఫార్మా ప్రతినిధులు, డాక్టర్ రమాదేవిని అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ అభినందించారు. అనంతరం ఫార్మా ప్రతినిధులకు అకాడమీ జ్ఞాపికలను అందజేశారు.

వడ్డెరులను ఎస్టీల్లో చేర్చాలి

ఎమ్మెల్యే నాగేందర్‌కు వినతి

ఫిలింనగర్: వడ్డెర కులస్తులను ఎస్టీలో కలపాలని ఫిలింనగర్ 18 బస్తీలకు చెందిన 40 మంది వడ్డెర కులస్తులు బుధవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో తప్పకుండా ఈ విషయంపై మాట్లాడతానని దానం నాగేందర్ వీరికి హామీనిచ్చారు.

తెలంగాణతల్లి విగ్రహంపై రాజకీయం తగదు: గౌరీసతీష్


గౌరీ సతీష్

అబిడ్స్: తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం హాస్యాస్పదంగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్ అన్నారు. తొమ్మిదిన్నరేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ తెలంగాణ తల్లిని అధికారికంగా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం తెలంగాణ తల్లిని అధికారికంగా ప్రకటిస్తే జీర్ణించుకోలేక మాజీమంత్రులు కేటీఆర్, హరీష్‌రావు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. బుధవారం తన కార్యాలయంలో గౌరీ సతీష్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలోనే తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరుగుతోందన్నారు. ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా ఉండి ఇంటిస్థలాలు, కోటి రూపాయల నగదు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉంటుందని గౌరీసతీష్ అన్నారు. తెలంగాణ తల్లిని, తెలంగాణ ఉద్యమకారులను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు.

బోర్డు ద్వారానే కార్మికులకు పథకాలను అందించాలి


మల్లేష్

మణికొండ: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను సంక్షేమ బోర్డు ద్వారానే అందించాలని సంఘం జిల్లా కార్యదర్శి మల్లేష్ అన్నారు. బుధవారం ఆయన నార్సింగిలో విలేకరులతో మాట్లాడుతూ... సంక్షేమ పథకాలను బీమా సంస్థలకు వచ్చే విషయాన్ని రద్దు చేసుకోవాలని, సంక్షేమ మండలి సంక్షేమ బోర్డును కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలన్నారు. కార్మికుల ఆరోగ్య పరీక్షలకు ఖర్చు చేసిన సెస్ నిధుల దుబారాపై విచారణ చేయాలని, దారి మళ్లించిన నిధులను తిరిగి బోర్డులో జమచేయాలన్నారు. రూ. కోటి దాటిన నిర్మాణాల నుంచి 2 శాతం సెస్ వసూలు చేయాలని, లేబర్ కార్డు రెన్యువల్‌కు కార్మిక శాఖ కార్యాలయంలోనే కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్మిక చట్టాలలో ఉన్న పెన్షన్, స్కాలర్‌షిప్, ఇళ్లు, పనిముట్ల లోన్‌లను కార్మికులకు ఇవ్వాలన్నారు. లేబర్ అడ్డాల వద్ద అన్నపూర్ణ క్యాంటీన్‌లు, మూత్ర శాలలు, రెస్ట్ షెడ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ శ్రమ్ కార్డులు ఉన్న వారికే సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ప్రమాద, సహజ మరణాలతో పాటు ప్రసూతి సహాయాలను పెంచాలన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలకు లోటు లేకుండా సత్వరమే పూర్తి చేయాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భవానీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అధికారులు, జలమండలి అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పర్యవేక్షించారు. అలాగే కాలనీలో తాగునీటి సమస్యపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఎలాంటి జాప్యం.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. స్థానిక నేతలు సురేష్‌ముదిరాజ్, రఘుముదిరాజ్, లక్ష్మణ్, మోహన్, డివిజన్ అధ్యక్షుడు జనార్దన్ పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీల చలో హైదరాబాద్: సీఐటీయూ


సీపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణికొండ: అంగన్‌వాడీ టీచర్లకు నెలకు కనీస వేతనం రూ. 18 వేలు, వర్కర్లకు రూ. 12 వేలు ఇవ్వాలనే డిమాండ్‌తో గురువారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ డి.ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్‌ల అసోసియేషన్ గండిపేట మండల అధ్యక్షురాలు సుధారాణి తెలిపారు. ఈ కార్యక్రమానికి అనుమతించాలని కోరుతూ బుధవారం వారు శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ సీపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించటంతో పాటు ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా స్పందించనందునే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పట్టనున్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో శోభ, జ్యోతి పాల్గొన్నారు.

శుభాకాంక్షలు


ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన దిల్‌రాజును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజేందర్‌యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. -లంగర్‌హౌస్

సీవరేజీ పనులు ప్రారంభం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ మారుతీనగర్‌లో సీవరేజీ పనులకు బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ శంకుస్థాపన చేశారు. రూ.25లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులను వాటర్ వర్క్స్ జీఎం షరీఫ్, మేనేజర్ నదీంలతో కలిసి ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. మారుతీనగర్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు కృష్ణ యాదవ్, షరీఫ్, మహేందర్‌బాబు, లక్ష్మణ్ యాదవ్, ప్రసాద్ రమేష్‌లు పాల్గొన్నారు.